క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు



వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

వేసవి శిక్షణ శిబిరాలతో విజ్ఞానం



చెస్ పోటీల్లో విద్యార్థులు

సబ్బవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు మంగళవారం పుస్తక పఠనం, చదరంగం పోటీలతో పాటు వైకుంఠపాళీ ఆడించారు. ఇలాంటి పోటీలను నిర్వహించడం వలన వారిలో మేధోశక్తి, సృజనాత్మకత పెరుగుతాయని గ్రంథాలయ అధికారి వి.శిరీష తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ప్రతి రోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దీంతో విద్యార్థుల్లో విజ్ఞానాభివృద్ధికి దోహదపడుతోందన్నారు. కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

భగవద్గీత విశిష్టతపై అవగాహన



గేయాల పుస్తకాలను అందిస్తున్న గీత ప్రచార సాధకులు మింది బాబ్జి

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు భగవద్గీత విశిష్టతను గీత ప్రచార సాధకులు మింది బాబ్జి మంగళవారం వివరించారు. విద్యార్థులంతా భగవద్గీత గొప్పతనం తెలుసుకుని, అందులోని ప్రతి అంశాన్ని ఆచరించేందుకు ప్రయత్నించాలన్నారు. ఈ సందర్భంగా భగవద్గీత శ్లోకాలు సులభతరంగా నేర్పించారు. చిన్న చిన్న గేయాల రూపంలో తయారుచేసిన పుస్తకాలు అందించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కేఎస్ఆర్ మూర్తి విద్యార్థులకు నీతి కథలు, విద్య ఆవశ్యకత గురించి వివరించారు. కార్మిక నాయకుడు సీహెచ్ఎస్ఎన్ రాజు విజ్ఞాన అంశాలను తెలిపారు. కార్యక్రమంలో సింహాచలం వాకర్స్ క్లబ్ సభ్యుడు ఎస్.కృష్ణంరాజు, గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం పాల్గొన్నారు.

అత్యాచార యత్నంపై ఫిర్యాదు

సబ్బవరం: అత్యాచారానికి ప్రయత్నించిన వ్యక్తిపై ఓ మహిళ సబ్బవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాలు.. మండలంలోని అంతకాపల్లి శివారు ఒమ్మువానిపాలేనికి చెందిన వివాహిత పిల్లల హేమలత డెలివరీ కోసం రాయపుర అగ్రహారంలోని తన పుట్టింటికి వచ్చింది. నెల క్రితం డెలివరీ అయింది. సోమవారం సాయంత్రం స్నానం చేసి ఇంట్లోకి వెళ్తుండగా.. ఇంటి సమీపంలో ఉంటున్న పల్ల దేముడుబాబు అత్యాచారానికి ప్రయత్నించబోయాడు. ఆమె కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు చేరుకున్నారు. దీంతో దేముడు బాబు పరారయ్యాడు. కుటుంబ సభ్యుల సహకారంతో సోమవారం రాత్రి బాధితురాలు హేమలత పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టి, కేసు నమోదు చేయనున్నట్లు సీఐ జి.రామచంద్రరావు తెలిపారు.



సింహపురికాలనీ పార్కులోకి ప్రవేశించే ప్రధాన మార్గంలో నిలిచిన వర్షం నీరు

పిచ్చిమొక్కలు, తుప్పలతో విషపురుగులు, ఆకతాయిల చేష్టలకు నెలవుగా ఉండే ఖాళీ స్థలాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్కులుగా అభివృద్ధి చేసింది. స్థానికులు ఉదయం, సాయంత్రం వేళల్లో వచ్చి వాకింగ్, చిన్నచిన్న వ్యాయామాలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటి పర్యవేక్షణ పక్కదారిపట్టింది. నిర్వహణలేక మళ్లీ పూర్వస్థితికి చేరుకుంటున్నాయి.



అధ్వానంగా ఉన్న పార్కులో ఆటలు ఆడుకుంటున్న చిన్నారులు

కళావిహీనంగా.. కాలనీ పార్కులు

- గత ప్రభుత్వంలో అభివృద్ధి చేసిన పార్కులపై 'కూటమి'నిర్లక్ష్యం
- నిర్వహణ కొరవడటంతో.. పూర్తిస్థాయి వినియోగానికి దూరం
- దయనీయం.. సింహపురికాలనీ, సింహపురి లేఅవుట్ పార్కులు



సింహపురి లేఅవుట్‌లో పార్కులో బురదమయంగా వాకింగ్ ట్రాక్



పార్కులో ఏపుగా పెరిగిన తుప్పలు



పార్కు ఓపెన్ జిమ్‌లో పరికరాల వద్ద అరకొరగా ఉన్న చిన్నారులు

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీ, సింహపురి లేఅవుట్‌లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన పార్కులు కళావిహీనంగా మారుతున్నాయి. రూ.లక్షలు వెచ్చించి పార్కులను అభివృద్ధి చేసినా.. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక వాటి పర్యవేక్షణను గాలికొదిలేశారు. దీంతో ఆశించిన ప్రయోజనం దక్కట్లేదని కాలనీవాసులు ఆక్షేపిస్తున్నారు.

మూణ్నాళ్ల ముచ్చటే..

సింహపురికాలనీలో రూ.49 లక్షలతో ఎకరం విస్తర్ణంలో ఉన్న పార్కు స్థలం చుట్టూ ప్రహరీని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జీవీఎంసీ నిర్మించింది. పార్కులో చిన్నచిన్న వ్యాయామాలకు వీలుగా జిమ్ పరికరాలు, కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేసింది. దీంతో కాలనీలోని చిన్నా పెద్దా అంతా ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుకు రావడం మొదలయింది. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో పార్కులోకి వచ్చే చిన్నారుల సంఖ్య మరింత పెరిగింది. అయితే పార్కులో ఎక్కడ చూసినా అపరిశుభ్ర వాతావరణమే కనిపిస్తోంది. వర్షం వస్తే పార్కులోకి ప్రవేశించే ప్రధానమార్గంలో పెద్ద ఎత్తున నీరు నిలిచిపోతోంది. దీంతో చిన్నారులు, వృద్ధులు పార్కుకు వచ్చేందుకు భయపడుతున్నారు.

ఆటలాడుకునేదెలా?

పార్కులో ఏర్పాటుచేసిన వేదిక వెనుక భాగంలో పెద్ద ఎత్తున పిచ్చి మొక్కలు, తుప్పలు ఏర్పడ్డాయి. చిన్నారులు ఆటలాడుకునే సమయంలో క్రీడాపరికరాలు తుప్పల్లోకి వెళ్తే, తీసుకోవడం కష్టంగా మారుతోంది. పార్కులో లైటింగ్ సదుపాయం లేకపోవడంతో చీకటి పడితే ప్రవేశించలేని పరిస్థితి. కనీసం ప్రధాన గేటును కూడా దాటి వెళ్లలేని దుస్థితి. ఉదయం, సాయంత్రం వేళల్లో తీరికలేని కాలనీవాసుల్లో కొందరు రాత్రి 7 తర్వాత పార్క్‌లోకి వచ్చి జిమ్ పరికరాలతో వ్యాయామం చేసేందుకు సాహసించలేని పరిస్థితి నెలకొంది.

వాన పడిందా.. వాకింగ్ గోవిందా!

సింహపురి లేఅవుట్‌లో పార్కు అభివృద్ధికి రూ.49.54 లక్షలతో కూటమి ప్రభుత్వంలో పనులు జరిగాయి. ప్రహరీ, జిమ్ పరికరాలు, బెంచీలతో పాటు వాకింగ్ ట్రాక్ కూడా ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మార్చిలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పార్కుని ప్రారంభించారు. భారీగా డబ్బులు చెల్లించి జిమ్‌లకు వెళ్లలేని వారు పార్కులో ఉన్న ఓపెన్ జిమ్‌ల సేవల్ని వినియోగించుకుంటున్నారు. ముఖ్యంగా ఇళ్లకే పరిమితమైన పలువురు గృహిణులు సైతం ఇంటికి సమీపంలోనే ఓపెన్ జిమ్‌లు ఉండటంతో వస్తున్నారు. కానీ అరకొర సౌకర్యాలు వీరికి పూర్తిస్థాయి ప్రయోజనాన్నీయట్లేదు. ముఖ్యంగా వర్షం పడితే వాకింగ్ ట్రాక్ అంతా బురదగా మారుతోంది. దీంతో ఎక్కడ జారిపడతామో అన్నభయంతో వాకర్స్ వాకింగ్‌కు సెలవిచ్చేస్తున్నారు. పార్కులో విపరీతంగా రాలుతున్న చెట్ల ఆకుల్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం లేదు. దీంతో పెద్ద ఎత్తున ఆకులు పేరుకుపోతున్నాయి.

అంతా అంధకారం!



సింహపురికాలనీలో ఉన్న పార్కులోకి రాత్రి 7 గంటలు దాటిన తర్వాత ప్రవేశించలేని పరిస్థితి. ఎటు చూసినా అంధకారమే. పార్కులో విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలి. ఎప్పటికప్పుడు తుప్పలు తొలగించి పిల్లలు ఆడుకునేందుకు అనువుగా స్థలాన్ని ఉంచాలి. వర్షం వస్తే బురద ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలి.

– ఎస్.రామరాజు, సింహపురికాలనీ

ఆర్చరీలో గణేష్‌మణిరత్నం ప్రతిభ



గణేష్ మణిరత్నం

పరవాడ: మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్లో ఏర్పాటైన ఆర్చరీ అకాడమీలో శిక్షణ పొందిన టి.గణేష్‌మణిరత్నం పూనేలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ ట్రయల్స్‌లో అర్హత పొందినట్లు స్కూల్ ప్రతినిధులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో కెనడా, సింగపూర్‌లలో జరగనున్న యూత్ వరల్డ్ చాంపియన్‌షిప్, ఆసియన్ కప్ స్టేజ్–2 పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గణేష్‌మణిరత్నంను విశాఖ ఆర్చరీ సంఘ చైర్మన్ పి.సూర్యనారాయణ రెడ్డి, కార్యదర్శి కె.నిశాంత్, కోశాధికారి పి.భాస్కర్ ప్రత్యేకంగా అభినందించారు. పోటీలకు గణేష్ మణిరత్నం ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని క్రీడావసరాల కోసం సంస్కృతి గ్లోబల్ స్కూల్ చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు.

ఘనంగా పరదేశిమాంబ పండగ



పరదేశిమాంబ

పెందుర్తి: మండలంలోని సరిపల్లి గ్రామదేవత పరదేశిమాంబ వార్షిక పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. పసుపు– కుంకుమలు, చీరలు, ముడుపులతో మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి సన్నిధిలో భక్తులు అగ్నిగుండాలు తొక్కారు. సాయంత్రం ఘటాల ఊరేగింపు సందడిగా సాగింది. గ్రామంలో నుంచి అమ్మవారి ఆలయం వరకు దారి పొడవునా అమ్మవారి ఘటాలకు ప్రజలు పూజలు చేశారు. డప్పు వాయిద్యాలు, బాణాసంచా వెలుగుల నడుమ అనుపోత్సవం వైభవంగా జరిగింది. సరిపల్లి, పెందుర్తి, చిక్కాలపేట, జంగాలపాలెం గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు.

జీవో నెం.4ను రద్దు చేయాలని వినతి

- సచివాలయాల అనుసంధానం వీఆర్వోలకు శాపం
- ప్రభుత్వానికి పెందుర్తి మండల వీఆర్వోల వినతి



తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఆర్వోలు

పెందుర్తి: క్లస్టర్ విధానంలో రేషనలైజేషన్ పేరుతో గ్రామ/వార్డు సచివాలయాలను అనుసంధానం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం గ్రామ రెవెన్యూ అధికారులకు శాపంగా మారుతుందని డివిజనల్ వీఆర్వోల సంఘం ప్రతినిధి సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్వోల పని ఒత్తిడి, అనారోగ్య సమస్యల దృష్ట్యా జీవో నెంబర్ 4ను రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్‌కు పెందుర్తి రెవెన్యూ మండల పరిధిలోని వీఆర్వోలు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ సర్వేలు, గ్రామ సభలు, పీజీఆర్ఎస్ సమస్యల పరిష్కారంతో పాటు రోజువారీ కార్యకలాపాలతో తీవ్ర ఒత్తిడి గురవుతున్నామన్నారు. ఇలాంటి పరిస్థితిలో రెండు సచివాలయాలను ఒక్కటి చేస్తే వీఆర్వోలకు మరింత పని ఒత్తిడి పెరిగి, తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2019కి ముందు, ఆ తర్వాత కొనసాగిన ఒక రెవెన్యూ విలేజ్, ఒక వీఆర్వో విధానాన్నే కొనసాగించాలని కోరారు. పెందుర్తి గ్రామీణ, పట్టణ ప్రాంత వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆటలాడుతూ.. కథలు చదువుతూ..



బెలూన్లతో ఆటలు ఆడుతున్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు పరమానందయ్య శిష్యుల కథను విశ్రాంత ఉపాధ్యాయుడు ఆర్.జానకీరామ్ బోధించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు ఇంగ్లిష్ నేర్పించారు. పలు ఆటలు ఆడించారు. యోగా గురువు లక్ష్మీప్రసన్న ధ్యానంపై మెళకువలు నేర్పారు. ఉపాధ్యాయురాలు చంద్రకళ ఆధ్వర్యంలో బెలూన్ గేమ్ ఆడించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత



యోగాసనాల్లో ఎమ్మెల్యే పంచకర్ల, అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్



యోగాసనంలో కలెక్టర్

పరవాడ: యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత సాధ్యమని, యోగాను ప్రతి ఒక్కరు దినచర్యగా చేసుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతంలో జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం, యోగాంధ్ర–2025 కార్యక్రమంలో భాగంగా వెయ్యి మంది యోగా అభ్యాసకులతో మంగళవారం యోగాసనాల ముందస్తు సన్నద్ధత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌లు పాల్గొని యోగాసనాలు చేశారు. అనంతరం కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ జిల్లాలో 25 మంది యోగా గురువులు, 100 మంది మాస్టర్ ట్రైనీలతో 4,500 మంది సచివాలయ సిబ్బందికి వివిధ యోగాసనాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పొందిన సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రతి గ్రామానికి వెళ్లి, రోజుకు 50 మంది చొప్పున ఐదు రోజుల పాటు క్రమం తప్పకుండా రోజుకో యోగాసనం వేసేలా శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ రోజూ ఓ గంట పాటు యోగా చేయడం వలన మానసిక ఒత్తిడి తగ్గి, ప్రశాంతత లభిస్తుందన్నారు. రోజంతా ఉత్సాహంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె.లావణ్య, జిల్లా పర్యాటక శాఖ అధికారి కె.మనోరమ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి అనిత, మండల ప్రత్యేక అధికారి సరోజిని, సర్పంచ్ చింతకాయల సుజాత, ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు, తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్, పరవాడ, సబ్బవరం, పెందుర్తి మండలాలకు చెందిన అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

యోగా శిక్షణ ప్రారంభం



యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది

సబ్బవరం: యోగాతో శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీడీవో పద్మజ తెలిపారు. యోగాంధ్ర–2025లో భాగంగా స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో పలువురు అధికారులకు యోగా శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం బిజీగా ఉండే ఆధునిక కాలంలో ప్రతి మనిషి మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఒత్తిడిని అధిగమించడంతో పాటు మానసిక ప్రశాంతత కోసం యోగా దినచర్యలో ఓ భాగం కావాలన్నారు. ఉద్యోగులతో పాటు పలు వృత్తుల్లో ఉన్నవారు ప్రతి దినం యోగా, ధ్యానం ఆచరించాలని సూచించారు. వెలుగు, మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి 150 మందిని మండల స్థాయి ట్రైనర్‌లు తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. వీరంతా తమ గ్రామాల్లో కనీసం 150 మంది చొప్పున శిక్షణ ఇచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏవో శివ ప్రసాదరావు, వెలుగు ఏపీఎం సీహెచ్ శ్రీనివాసరావు, యోగా గురువు పి.సత్యనారాయణ, వెలుగు, మాతా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్ అందజేత



లక్ష్మికి చెక్ అందిస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, చిత్రంలో ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: మండలంలో రావాడ గ్రామానికి చెందిన చుక్క లక్ష్మి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్టీఆర్ ఆరోగ్య భరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకుంది. దీంతో సీఎం సహాయ నిధి నుంచి రూ.4.65 లక్షలు మంజూరయ్యాయి. ఈ చెక్కును అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చేతుల మీదుగా లబ్ధిదారుకి మంగళవారం ముత్యాలమ్మపాలెం గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ వైద్యపరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న సీఎం సహాయ నిధులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల పండగ

పెదగంట్యాడ: మండలంలోని బర్మాకాలనీ ప్రాంతంలో వేంచేసిన మర్నిమాంబ, మోదకొండమ్మ అమ్మవార్ల పండగను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు. వేకువజాము నుంచి ఆలయం వద్ద భక్తుల సందడి కనిపించింది. అమ్మవార్లను వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి శంకరనారాయణ, గొందేశి శ్రీనివాసరెడ్డి, బొడ్డ గోవింద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవార్లకు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. చీర సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు సమ్మంగి అప్పలరాజు వరలక్ష్మి ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలి



గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: అర్హులైన ప్రతి ఒక్కరికి గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవనంలో మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు దాటినా ఇంతవరకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. వందలాది పేద కుటుంబాలు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్–6 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె. వనజాక్షి, ఆనంద్, అచ్యుత్‌రావు, సూర్యపద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: టెక్ మహీంద్ర సహకారంతో కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్‌లో 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసున్న డిగ్రీ, ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి ఉచిత శిక్షణ అందించనున్నట్టు బొల్లినేని మెడిస్కిల్స్ ఈడీ సీహెచ్.నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. హెల్త్‌కేర్ బిల్లింగ్, జీడీఏ కోర్సుల్లో 3 నెలలు శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు డిప్లొమా పారామెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. వివరాలకు 7207953919, 7995013421 నంబర్లలో, శీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ ఆవరణలోని ఇన్‌స్టిట్యూట్‌లో సంప్రదించాలని కోరారు.

పీఎఫ్ ఎంట్రీ లోపాలు సవరించాలని వినతి



పీఎఫ్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న భెల్ సిటు నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ ట్రెనింగ్ సెంటర్‌లో మంగళవారం పీఎఫ్ (అదాలత్) నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ సీఐటీయూ (సిటు) ప్రధానకార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ 1992 నుంచి జాయిన్ అయిన ఉద్యోగులకు డేట్ ఆఫ్ జాయినింగ్ సరిగ్గా లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనికి కారణం పీఎఫ్ అధికార యంత్రాంగమే అన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఉద్యోగుల డేట్ఆఫ్ జాయినింగ్ సరిచేసి తగిన విధంగా పెన్షన్ వచ్చేలా చేయాలని కోరారు. అలాగే సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రిటైర్ అయిన ఉద్యోగులకు రావాల్సిన హయ్యర్ పెన్షన్ రాలేదని, ఆ పెన్షన్లు అప్లై చేసిన ఉద్యోగులకు రిటైర్ అయినట్లు మెయిల్స్, మెసేజ్‌లు వచ్చాయని, ఇది చాలా దుర్మార్గమైన చర్య అని అన్నారు. భెల్ ఇతర యూనిట్లలో హయ్యర్ పెన్షన్ వస్తుందని, విశాఖ యూనిట్లో రాకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై పీఎఫ్ కార్యాలయంలో విశ్వనాథ్, వైభవ్, శివశంకర్ తదితర అధికారులకు సీఐటీయూ నాయకులు జి.టి.పి.ప్రకాష్, సీతన్నాయుడు, ఎస్.జగన్నాథరావు, పి.ఆనందకుమార్, కె.నారపురెడ్డి, అల్లు అప్పారావు, జి.అచ్చంనాయుడు తదితరులు వినతి పత్రాన్ని అందజేశారు.

3 నుంచి మహాగణాధిపతి ప్రతిష్ట మహోత్సవాలు



అన్నపూర్ణానగర్‌లో ఉత్సవ గోడపత్రిక ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి దరి అన్నపూర్ణానగర్‌లో ఏర్పాటు చేసిన శ్రీపూర్ణ మహాగణాధిపతి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు వచ్చేనెల 3 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన గోడపత్రికను మంగళవారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఆవిష్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ దానబాల సన్యాసిరావు మాట్లాడుతూ 3,4 తేదీల్లో విగ్రహ శిఖర కలశ ప్రతిష్టా మహోత్సవం, 5న విగ్రహ ప్రతిష్టా మహోత్సవం చేపట్టడం జరుగుతుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం విశేష అన్న సమారాధన నిర్వహించనున్నామనితెలిపారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, వీఆర్‌సీ మూర్తి, మామిడి అప్పారావు, దొడ్డి దేముడు, గోపిశెట్టి అప్పారావు, శ్యామ్‌సన్, నాగేశ్వరరావు, మురళి పాల్గొన్నారు.